# అంతర్వాహిణి

## వేమకోటి సీతారామమూర్తి

ఎన్నో వేల సంవత్సరాల నాటి మాట..... అప్పటికే మన భారతదేశ చరిత్ర రూపురేఖలు దిద్దుకుంది. భారత నాగరికత వేకువ వెలుగులు నలుదిశలా ప్రసరింప ప్రారంభించినాయి.

ఈ మన ప్రాచీన భరత భూమి మహనీయులనే కుర్ని కన్నతల్లి మునీశ్వరులకీ, ఆచార్యులకీ పుట్టిల్లు. ఆ మహోమహులు మేఘమాలికల్ని ముద్దాడే మహోగిరి శిఖరాల్లా నిశ్చలంగా నిలబడి, ఒడ్డులొరుసుకుంటూ నిర్మలంగా ప్రశాంతంగా ప్రవహించే భారతీయ జీవన స్రవంతిని పరికించారు. పచ్చని చేలతో పచ్చిక బయళ్ళతో కళకళలాడే ఈ కమనీయ భూమిని మధుర నిర్మల పయఃప్రభావితాలైన నదినదాల్ని చూసి ఉత్సాహం ఉప్పొంగుతూ కవులు కీర్తించారు గానం చేశారు.

ఈ మన జన్మభూమి విజ్ఞానఖని. ఇప్పటిలాగానే అప్పుడూ భారతదేశానికి ఆయువు పట్టులు గ్రామాలే. అభమూ శుభమూ తెలియని ప్రజానీకం సంతోషంగా సంతృప్తిగా బ్రతికే రోజులవి. ధర్మం, అర్ధం, కామం ఈ మూడు ఆశయాల్ని ముప్పేటలుగా పేని అవధులు దాటని ఆనందాన్ని, మధుర అనుభూతుల్ని నిర్మలమయిన నిండు జీవితాన్ని సాధించుకున్నారా ప్రజానీకం. తమ జీవన మార్గం ముళ్ళమయం చేయగలిగిన పేరాశలకు దురాశలకుదూరంగా తమదైనందిన కార్యక్రమం సక్రమంగా నిర్వహించుకునే వారు.....

రెండో అంతస్థులో బాల్కనీలో మెత్తటి సోఫాలో కూర్చున్న సిద్దార్థ చదవటం ఆపేశాడు. తన్మయత్వంతో తలవూగించుకుంటూ వింటున్న వీరయ్య కళ్ళు తెరచి చూశాడు.

"బాగుంది చినబాబూ! ఏం ఆపేశావు" ప్రశ్నించాడు ఆతృతగా. దానికి సమాధానం దూరంగా మోగుతున్న కారుహారను చెప్పింది. వీరయ్య చివాలున లేచి చూశాడు. కారు వూరవతల మలుపు తిరిగి వస్తోంది. దాని వెనుక నాలుగైదు కార్లు వస్తున్నాయి.

"బాబూ! నాన్నగారు మా రాజయిపోయినారు...." అన్నాడు ఆనందంగా సిద్దార్థకు బోధపడలేదు. విచిత్రంగా చూశాడు.

"అవును బాబూ! మారాజంటే మారాజు కాదు. జిల్లా పరిసత్తు సేర్మేను.....అంటేకంటే మన జిల్లాకి రాజన్నమాట" అన్నాడు మెట్లుదిగుతూ, ఆనందంగా. మేడ మీద నుండే చూస్తున్నాడు సిద్దార్థ. అతనుండే గ్రామం పట్టణానికి పదిమైళ్ళ దూరంలో వుంది. ఆ గ్రామంలో అర ఎకరా ఆవరణలో విశాలంగా కట్టిన రెండస్థులమేడ. మిగిలినవన్నీ తాటాకు గుడిసెలే. మేడలో అప్పుడే లైట్లు వెలిగాయి. సిద్దార్థ గదిలో తల్లి ఫోటోకు దండం పెట్టాడు. ఆ ఫోటోకు వాడిపోయిన పూలమాలవుంది. కారు దగ్గరకు వచ్చింది. బాల్కనీలో నిలబడ్డాడు సిద్దార్థ. ముందు గేటు దగ్గర ప్రజలంతా గుమిగూడారు. విమానంలా వుందా కారు. చామంతి, సంపెంగ, మల్లెపూల దండలు కప్పబడి కావ్యాల్లో వర్ణించిన పూలతేరులా వుంది. అప్పుడు దిగారు ఆ జిల్లాకు మకుటంలేనిమహారాజా, సిద్దార్థ తండ్రి అప్పల నాయుడు.

ఆయన అంత పొట్టిగాను, అంత పొడుగ్గానూ వుండరు. మీసాలకు తలకు వేసిన రంగు తీసేస్తేగాని ఆయనకు అరవైయేళ్ళు దాటాయని ఖచ్చితంగా చెప్పలేం. ఖరీదయిన పొందూరు పొట్నాలు పంచె, బరంపురం పట్టు లాల్చీ, జరీ ఖండువా వీటన్నిటి మధ్య యిమిడిన ఆయన శరీరం దర్పంతో వూగిపోతున్నాది. ఆ వెలుగులో ఆయన కళ్ళలో విజయగర్వంతో పాటు అహం కూడా చోటు చేసుకుని విర్రవీగుతోంది. గేటు ముందే ఆగారాయన.

"సేర్మేన్ గారికీ జై" అన్నకేకను గుంపంతాకోరస్ పాడింది. పాలేరు లచ్చిగాడి పెళ్ళాం వసంతం నీళ్ళు తెచ్చి దిష్టి తీసి మంగళహారతి యిచ్చింది.

అప్పుడు ఆవరణలోకి అడుగుపెట్టారు. సిద్దార్థకిదంతా గమ్మత్తుగా కన్పించింది.

వీమలబారులా హాలులోకి కొంతమంది ముఖ్యులు దూరారు. కొత్త పెళ్ళికొడుకులా సోఫాలో కూర్చున్నారు అప్పల నాయుడు. తరువాత మిగిలినవారు కూర్చున్నారు. క్షణంసేపు హాలంతా నిశ్శబ్దం.

"మొత్తం మీద మనం అనుకున్నది సాధించాం ఏం సూరయ్య మావా" అన్నాడొక సమితి ప్రెసిడెంటు. అందరూ అతనివేపు చూశారు. "అంతా మీ అందరి దయ" అన్నాడు సూరయ్య వ్యంగ్యంగా కొంతమందిని డబ్బెట్టి కొన్నాడతను.

"అలాగే అంటావు. నువ్వు సెక్రం అడ్డేసి తిప్పేసినావు. మన అప్పలనాయుడు బావ రాజయిపోనాడు" అన్నాడు రెండో సమితి ప్రెసిడెంటు.

"ఆ, నాదే ముందిలే. అంతా అన్నగారు వేసిన ప్లాను" అన్నాడు సూరయ్య ఖండువాను సర్దుకుని లోపలికి వెడుతూ. అది అబద్ధమని అందరికీ తెలుసు.

"రేపట్నుంచి అప్పల్నాయుడు బావా! మనం ఎగస్పార్టీ వోళ్ల పని బట్టాలా!..." అన్నాడింకో వ్యక్తి. అందరికీ అప్పలనాయుడిగారి చిరునవ్వే సమాధానం.

ఇంతలో అందరికీ అందమయిన గాజు కప్పుల్తో టీ వచ్చింది. లచ్చిగాడి పెళ్ళాం పంచుతున్నాది.

"వుప్పుడేటి బావా! ఏలకాని యేలప్పుడీ టీలు" అన్నాడు మొదటి ప్రెసిడెంటు.

"నీకన్నీ తొందరేన్రా ఈరకాడా! యేర్పాటుసేసే వరకయినా ఆగవు కదా...." అన్నాడు సూరయ్య డైనింగుహాలులో నుండి బయటకు వస్తూ. అక్కడి వాళ్ళ ఆలోచన్లలాగే, ఆ హాలులో కొత్త ఫేన్లు గిరగిరా తిరుగుతున్నాయి.

"బావా! ఈ శుభ సందర్భంలో నీ కొడుకు నోపారి సూపించవా" అడిగాడు రెండో ప్రెసిడెంటు.

"మీ అమ్మాయినిచ్చి సుట్టరికం కలిపేసుకుంటావేటి మరి..." అడిగేడు మొదటి ప్రెసిడెంటు.

"కలుపుకుంటే తప్పా సూరయ్య బావా. నాకొక్కగానొక్క కూతురు. ఉన్నదంతా దానికే గదా..." అన్నాడు సూరయ్యని చూస్తూ.

"మా అమ్మాయికయితే నా ఆస్తికాక, అత్తమ్మగారి ఆస్తి, పెదనాన్నగారి ఆస్తి కలుస్తుంది. వీసెడు బంగారం యిస్తాను...బావా నీకేదే చెప్పడం..." అన్నాడు రెండో ప్రెసిడెంటుని కోపంగా చూస్తూ.

దేవుడు భక్తుల్ని మెచ్చుకున్నట్లు భక్తులవంక చిద్విలాసంగా చిరునవ్వు రువ్వినట్లు చిరునవ్వు నవ్వాడు అప్పలనాయుడనబడే రాజు. ఆయన కనుసొంజ్ఞ అందుకున్న వీరయ్య సిద్దార్థతో బాటు హాలులోకి వచ్చాడు. సిద్దార్థ సన్నగా పొడుగ్గా, ఆరోగ్యంగా కోటేరులాంటి ముక్కుతో, పచ్చని దబ్బపండులాంటి శరీరంతో గడ్డం దగ్గర పుట్టుమచ్చతో రాకుమారుడిలా వెలిగి పోతున్నాడు. ఆ రాకుమారుడ్ని చూసి క్రాసు ఓటింగు వేసి తాము అప్పలనాయుడ్ని గెలిపించినందుకు తమని తామే అభినందించుకున్నారు వేర్వేరుగా.

"ఏటి సదువుతున్నావు బాబూ" అడిగారిద్దరూ ఒకే సారి.

"యింటరు పరీక్ష కెడుతున్నాడు" అన్నాడు వీరయ్య గర్వంగా.

"నాన్నగారి కాలేజీలో చదువుతున్నావా?" అడిగాడింకో వ్యక్తి.

"ఏదీ గత సంవత్సరమేగా ప్రయివేటు కాలేజీ తెరిచాం. మావాడు మాత్రం యింటి దగ్గర ప్రయివేటుగానే చదువుతూ అన్ని పరీక్షలూ ఫస్ట్ క్లాసులో ప్యాసయ్యాడు. యిప్పుడు యింటరుకూ అలాగే..." అని సమాధానమిచ్చాడు.

"అదేటదీ...." అడిగాడు రెండో ప్రెసిడెంటు.

"అదంతే. అన్నగారికి స్కూలు చదువుల మీద, కాలేజీ చదువుల మీద నమ్మకం లేదు. పిల్లవాడు చెడిపోతాడని యింటివద్దనే..." సూరయ్య మాట సగంలోనే ఆగిపోయింది.

"నిజమే మరి మేష్టర్లు రాజకీయాల్లో పడ్డారు. లెక్చరర్లు ట్యూషన్లకు అలవాటు పడ్డారు. యింక పిల్లలు అచ్చారాలకన్నా ప్రియుకులు ముందు నేరుసుకున్నారు..." అన్నాడు గలగల నవ్వుతూ రెండో

ప్రెసిడెంటు.

''అందుకనే బావా! నిన్నెన్నుకున్నాం. మేష్టర్లన బదిలీ సేయించి, చదువులు పిల్లలకి సుబ్బరంగా సెప్పించు. పెయివేటు కాలేజీకి పెసిడెంటుగా వుండి లెక్చరర్లని దార్లో పెట్టేసి...''అన్నాడు మొదటి ప్రెసిడెంటు.

''ముందలాగే అంటారు. తర్వాత రికమెండేసన్లు తెచ్చి మా ప్రాణాలుతోడేస్తారు...'' అన్నాడుసూరయ్య వీరయ్య చేసిన సౌంజ్ఞతో సిద్దార్ధ మెట్లెక్కి వెళ్ళి పోయారు.

''ఆహా! కొడుకంటే యిలా వుండాలండీ ఎంత వినయం, ఎంత భక్తి...'' అని హాలులో కొందరు ప్రశంసిస్తే ప్రెసిడెంట్లిద్దరూ గర్వపడ్డారు.

''పూజ్యురాలైన వొదినగారు హఠాత్తుగా గుండె పోటు వలన మరణిస్తే గంపెడు దుఃఖాన్ని గుండెలో పెట్టుకుని పిల్లాడికేలోటూ రానీయకుండా పెంచారు రేఃసంవత్సరం అమెరికా పంపి అక్కడ పెద్ద చదువులు చదివించాలనుకుంటున్నారు....'' అన్నాడు గర్వంగా సూరయ్య.

''బాబూ! అన్నీ సిద్ధమయి పోనాయండీ...'' అన్నాడు పాలేరు లచ్చిగాడు.

''పదండి'' అంటూనే లేచారు అప్పలనాయుడు.

''మరి మీరో?'' అన్నాడు సూరయ్య.

''అబ్బాయిని పంకరించి నేనూ వస్తాను...' అన్నాడు.

మేడ మెట్లెక్కుతున్న చప్పుడు అబ్బాయికి వీరయ్యకు బాగా పరిచితం. దీక్షగా చదువుతున్న కొడుకుని చూసి సంతోషించాడు.

''వీరయ్యా అందరు మేష్టర్లూవచ్చారా!''అడిగారు గుమ్మం దాటి బయట వరండాలో. లెక్చరర్లని గూడా మేష్టర్లని అంటారాయన.

''అందరూ వొచ్చినారు బాబూ. సిన్నబాబు కీసారి పసుటుక్లాసు తప్పదట బాబూ సెప్పారు'' అన్నాడు వినయంగా.

''ఎవుడికోసం వస్తుంది ఫస్ట్‌క్లాసు. రాకపోతే వూరు కుంటానా. అయిద్రాబాదు గడగడ లాడించినూ...'' అన్నాడు దర్పంగా.

''సిత్తం బాబూ....''

''సర్లే బాబుకేం గావాలో సూడు. సెడ్డ పుస్తకాలు సదవనీకు. సెడ్డ సావాసాలు సేయనీకు... మునపట్లా కాదు నాకు. అయిద్రాబాదు ఢిల్లీ పట్నం తిరుగు తుండాల. మినిస్టరీ గూడా వచ్చేస్తుందని వార్తలొచ్చేసి నాయి...'' అన్నారు మెట్లు దిగుతూ.


''యిన్ని సంవత్సరాలు సిన్నబాబుతో వున్నాను. నాను ఎలా సూసుకుంటానో మీకెరికనేదా! నాదీ ఒంటరి బతుకే కదా. నాను గూడా సినబాబుతోనే అమెరికా ఎల్లిపోతాను'' అన్నాడు ఆనందంగా వీరయ్య ఆకాశంలో విమానాలు ఎగురుతున్నప్పుడల్లా వీరయ్య తన చిన్నబాబుతో అమెరికా వెళ్ళినట్లు వూహించు కుంటూ వుంటాడు.

అప్పలనాయుడుగారు క్రింద డైనింగు హాలులోకి దూరారు. ''నాన్నగారేరి వీరయ్యా!'' అని అడిగే సరికి విమానంలో వీరయ్య అమెరికా ప్రయాణం ఆగి పోయింది. డైనింగు హాలు తలుపులు మూయ బడటం కనిపించింది.

''నాన్నగారు పూజకెళ్ళారు బాబూ!''

సిద్దార్ధ అడగలేదు. యిది వరలో ''బాబూ! పూజంటే మరేట్నోదు. శక్తి బాబూ! చాలా యివ్వా రాల్లో, ఆలోసెన్లలో యిల యిలాడి పోయి మైండు మరీ బేజారయి పోతే, పట్టలేని సంతోషంగానీ, పట్టలేని యిసారంగానీ మనసులో దాచుకోలేక పూజ సేస్తారు. ఆ తల్లి కరుణించి, కొత్తశక్తి యిచ్చి పంటిపాపల్లా పిచ్చోళ్ళని సాకినట్లుగా సాకి జోకొడుతుంది...'' అని వీరయ్య చెప్పిన మాటలు గుర్తున్నాయి.

** ** **



జిల్లా పరిషత్తు కారు విశాఖపట్నం సిమెంటు రోడ్డు మీద మెత్తగా పరిగెడుతోంది. తండ్రినీ సూరయ్య బాబాయినీ విమానం యెక్కించి వీరయ్యా, సిద్దార్ధ తిరుగుముఖం పట్టారు.

''పరీక్షలయి పోయాయి కదా! వీరయ్యా, బాబు ఏరోడ్రోం అవీ చూస్తాడు'' అని అప్పలనాయుడంటే వాళ్ళు బయలుదేరారు. విశాఖ రోడ్ల మీద జనం గుంపులు గుంపులుగా, ఒక ఫ్యాక్టరీ ముందు నిలబడి కేకలు వేస్తున్నారు. నినాదాలు చేస్తున్నారు. జనం అడ్డంగా వస్తే కారాపు చేశాడు డ్రైవరు.

''ఏమిటి వీరయ్యా! ఎందుకలా అరుస్తున్నారు వాళ్ళంతా?''

''ఏదో జాతర్లా వుంది బాబూ''అన్నాడు వీరయ్య. విశాఖపట్నం చాలా సార్లు రాలేదు వాడు.

''జాతర కాదు సార్! పేద కార్మికుల ఆకలి మంటలు జీవితాలకు జీతాలు చాలవని సమ్మె చేస్తు న్నారు. యివాల్టికిది నాలుగోరోజు...'' అన్నాడు డ్రైవరు. మూక ముందుకు వచ్చి కారు మీద పడింది. పోలీసులు చెదరగొడుతూ వుంటే, కారు వెనక్కి తీశాడు డ్రైవరు.

''అతనే బాబూ! కార్మిక నాయకుడు. గతనాలుగు రోజులుగా కోర్కెలసాధనకు కృషిచేయడానికి ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్నాడు'' అని చూపించాడు, గుంపు మధ్యలో దండలు వేసుకుని తిలకం పెట్టుకున్న వ్యక్తిని.

''మరి మనది స్వతంత్ర భారతదేశం కదా కావల్సి నవి అడిగే హక్కులేదా'' అని ప్రశ్నించాడు. పుస్తకాల్లో చదువుకున్న మాటలు మననం చేసుకుంటూ. డ్రైవరు కేం మాట్లాడాలో బోధ పడలేదు. ''మనకెందుకులే సినబాబు. అమెరికాలో యిలాంటివేటుండవు పదయ్యా డ్రైవరూ...'' అన్నాడు వీరయ్య. కారు కదిలింది.

ఇది జరిగిన నాలుగోరోజున వీరయ్య బాహు పంజరం నుండి సిద్దార్ధకు విముక్తి కలిగింది తాత్కాలి కంగా. వాడికి జ్వరం వచ్చింది. డాక్టరు రాసిన మందులు కొనడానికి పట్నం వెళ్ళాల్సి వచ్చింది.

''మా బాబే నేనంటే ఎంతభిమానమో! ఎవర్ని పంపించకుండా తనే తెస్తున్నాడు'' వీరయ్య అంత జ్వరంలోనూ మురిసిపోయాడు.

''గుడ్ మార్నింగ్ చినబాబుగారూ! ఇదేమిటి కారు లేకుండాకాలినడక నొచ్చేశారు.నాకుకబురంపినా, ఆఫీసుకి ఫోన్ చేసినా కారు తెచ్చేవాడిని కదా....'' అన్నాడు డ్రైవరు మందుల షాపు దగ్గర. సిద్దార్ధ ఎంతో సంతోషపడి పోయాడు. కార్లోపట్టణం అంతాపరిచయమైనా, స్వయంగా నడిచి అన్నీ చూడటం, అన్నింటికన్నా తనకన్నా కొంచెం ఎక్కువ వయసున్న డ్రైవరు కలవటం, అతని ముఖం వికసించింది.

''పదవయ్యా డ్రైవరూ ఎక్కడికయినా వెడదాం'' అన్నాడు మందులు జేబులో పెట్టుకుని.

''ముందు కాఫీ తాగుదాం. తర్వాత మన గెస్టు హౌసు కెడదాం. అక్కడ నుండి కారులో....'' సగంలోనే తుంచేశాడు.

''కారూ వొద్దు. గెస్టు హౌసూ వద్దు. ఇంకేమయినా చేద్దాం. పోనీ మీ యింటి కెళదాం...'' అన్నాడు. డ్రైవరుకెంతో సంతోషం వేసింది. దారిలో ఒక ముసలాయన కనిపించాడు. పండిన తమలపాకులా వున్నాడు. చొక్కా మాసిపోయి చిరిగి పోయి వుంది. అతనిలో అతను గొణుక్కుంటున్నాడు. ఆశ్చర్యంగా చూశాడు సిద్దార్ధ. ''యితనా బాబూ! అయ్యవారుద్యోగం చేసి చిన్న పిల్లలకు నీతి పాఠాలు చెప్పి, పెరిగే ధరల మధ్య జీతం చాలక నానా అవస్థలూ పడి, చివరకు దరిద్రం మూట కట్టుకుని ఉద్యోగం విరమించాడు. పెళ్ళీడు కెదిగిన ఆడపిల్లలు. కొడుకులు ప్రయోజకులై వీళ్ళను వదిలేశారు. మానసిక వేదనతో యిలా గొణుక్కుంటూ, వచ్చిన పింఛను చాలక శిష్యులేమయినా యిస్తే తీసికెళ్ళి కలో గంజో తాగుతారు''.

'ఆచార్య దేవోభవ' గుర్తుకొచ్చిన సిద్దార్ధ జేబులో నుండి పిడికెడు నోట్లు తీసి ఆయన కిచ్చి నమస్కరించాడు. డ్రైవరు ఆశ్చర్యపోయాడు. డ్రైవరు పదో క్లాసు వరకే చదువుకున్నాడు.

వీరయ్య కదల్లేని వారం రోజుల్లోనూ సిద్దార్ధ కొత్త ప్రపంచం దర్శించాడు. మార్గదర్శి డ్రైవరు. అతని పాదయాత్రలో....పేదితుల్ని, రోగగ్రస్థుల్ని, ముసలి వాళ్ళని, కుష్టువాళ్ళని, గుడ్డివాళ్ళని, బలహీనుల్నీ...భర్తతో కాపురం చేస్తూ విలాసాల కోసం, నగల కోసం వ్యభిచరించే భార్యని...భుక్తికోసం వ్యభిచరించే అమ్మాయిల్నీ, చదువుకున్నా ఉద్యోగాల వేటలో విసిగి పోయి ఏం చెయ్యాలో తోచక పిచ్చివాళ్ళలా తిరుగుతున్న నిరుద్యోగుల్నీ, భుక్తికోసం దొంగతనం చేసే దొంగల్నీ, మోసగాళ్ళని... యిలా... యిలా... చాలా దృశ్యాలు.

ఒకరోజు డ్రైవరు వీధి ముందు పాడుపడిన యింట్లో ఏడుపులు వినిపించాయి. రోడ్డు మీద ప్రాణం లేని శరీరం మీదపడి యింటిల్లిపాదీ రోదిస్తున్నారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

''ఏమిటది'' అడిగాడు సిద్దార్ధ.

''అతని ప్రాణం పోయింది....''

''పోయిందా?...ఎలా? మరి బ్రతకడా!...''

ఏది పోయినా తెచ్చుకోగలం. ఖరీదు పెట్టి కొనగలం. కానీ ప్రాణం తెచ్చుకోలేం సార్. చనిపోయిన వ్యక్తి నిజాయితీగా పనిచేస్తున్న ప్రభుత్వోద్యోగి. లంచం మేసిన ఆఫీసరుకు అనుకూలంగా ఏదో ఫైలు మీద నోట్ రాయలేదని యిరికించి సస్పెన్షను చేశారు. ఆ ఆవేదనలో గుండాగి మరణించాడు. పెద్ద సంసారం. ఎనభై ఏళ్ళ తల్లిగూడా వుంది....'' అన్నాడు గాద్గదికంగా. పాడె కదిలింది. భయంతో కళ్ళు మూసుకుని ''మనకీ అంతేనా...'' అడిగాడు.

''పుట్టిన ప్రతీజీవి మరణించాల్సిందే...'' చెప్పాడు హోటలు వేపు భోజనానికి దారి తీస్తూ.

మ్యాట్నీ యింగ్లీషుసినిమా చూసిబయటికొచ్చిన సిద్దార్ధకు మళ్ళా జనం బారులుతీర్చి మెయిన్ రోడ్డంట నినాదాలు చేసుకుంటూ కనిపించారు.

''మళ్ళా స్ట్రైకేనా? యింకా అది పరిష్కారం కాలేదా?''. ''కాదు సార్! అది ఫెయిలై పోయింది. ఆ రోజు మనం చూసిన లీడరు చంపబడ్డాడు. కానీ యిది వేరు సార్. మునిసిపాలిటీలో వార్డు కౌన్సిలరు చనిపోయాడు. బాగా గడించాడులెండి. యిప్పుడాతని కొడుకు పోటీ చేస్తున్నాడు లెండి. తప్పకుండా పెద్ద మెజారిటీతో గెలుస్తాడు''.

''అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నావు?''

''ఆస్తులు వారసత్వం ఎలాగో, ఈ రోజుల్లో పదవుల్లో వారసత్వం అలాగే సంక్రమిస్తుంది. ఇది ప్రజాస్వామ్యంలో ఊహాకందని ఆచారం...'' అన్నాడు ఆవేశంగా. ఇంటికి వెడుతూ పళ్ళూడిపోయి నడుం వంగిపోయి, పండిన జుత్తుతో రోడ్డుప్రక్కన ముసలమ్మ పండ్లమ్ముకుంటూ వుంది. భయంతో కళ్ళు మూసుకున్నాడు... అప్పుడు సిద్దార్ధకు మనస్సు చాలా దిగులుగా వుంది. ఎగురుతున్న పిట్టను బలవంతంగా పట్టుకుని పంజరంలో బలవంతంగా వుంచే సమయం వచ్చింది. మర్నాడు తండ్రి హైద్రాబాదు నుండి వచ్చేస్తున్నాడు. డ్రైవరు చేతిలో ఐదువందల రూపాయల నోట్లు వుంచి ''చాలా థాంక్సయ్యా'' అన్నాడు సిద్దార్ధ. డ్రైవరు కళ్ళు కృతజ్ఞతతో మెరిశాయి.

***      ***      ***


అర్ధరాత్రయింది. వీరయ్య మందుకొట్టి గుర్రుపెడుతున్నాడు. సిద్దార్ధకు నిద్ర పట్టలేదు. తండ్రి బెడ్ రూంలో నుండి కొంచెం బిగ్గరగా మాటలు వినిపిస్తున్నాయి. గది వద్దకు వెళ్ళాడు. తలుపులు కొంచెం వారగా వేసివున్నాయి. టీపాయ్ మీద స్కాచ్ విస్కీ బాటిలు వుంది. మధ్యన రెండు గ్లాసులు వున్నాయి. తండ్రీ, సూరయ్య బాబాయ్ త్రాగుతున్నారు. తండ్రి ముఖం ఎర్రగా వుంది. గదిలో కురుక్షేత్రంలో కృష్ణుడు అర్జునుడికి చేస్తున్న 'గీతబోధ' పటం వుంది.

''అన్నా నేనొక మాటడుగుతా! కాదనవు కదా....'' అన్నాడు సూరయ్య గ్లాసులో ఐసుముక్కలు వేస్తూ.

''అడుగురా...'' అన్నాడు దేవుడిలా ధీమాగా.

''అన్నా నువ్వు పంచాయితీ ప్రెసిడెంటుగా నిలబడ్డప్పుడు మనకి వుండేది రెండున్నరయకరాలు మాత్రమే. కానీ మనకివాళ నాలుగొందల ఎనభై ఎకరాలుంది. మిల్లులున్నాయి. షేర్లు వున్నాయి. యివన్నీ నేను చక్రం తిప్పి చేసినవే కదా! అలాగే నీకిన్ని పదవులు గూడా. యివాళో రేపో నువ్వు మంత్రి వయిపోతావు. ఆ తర్వాత ముఖ్యమంత్రివి గూడా అవుతావు. మరి ఈ జిల్లా పరిషత్తు చైర్మను నీక్కాబోయే సమితి ప్రెసిడెంటు ఈరకాళ్ళతో తనకిస్తావంటే తనకిస్తావని సెపరేట్‌గా ప్రోపగాండా ప్రారంభించారు. ఇంతకాలం నీకింత సేవ చేశాను నాకా పదవి యిప్పించు. మన కుటుంబంలోనే వుంటుంది....''అన్నాడు మూడో పెగ్గు వేసుకోకుండా. సూరయ్య మాటలు తడబడుతున్నాయి.

''ఓరి సూరిగా! ఎంత మాటన్నవురా! నా వగతం పంచుకు పుట్టినా నామనస్సు నీకర్ధంకాలేదురా! ఈ ఎదవ రాజకీయాలు నన్ను యిసిగించేస్తున్నాయిరా! ఎందుకీ రాజకీయాలనిపిస్తోంది.సిద్దార్ధబాబును ఎందుకీ రాజకీయాలకు దూరంగా వుంచానో నీకు అర్ధం కాలేదా? ఆడ్ని గొప్ప సదువుకున్నోడిగా సేద్దామని. కలకటేరు అవుతాడో, డాక్టరే అవుతాడో, ఇంజనీరే అవుతాడో ఆడిష్టం. మొన్న ఢిల్లీ ఎల్లినప్పుడు ఆడ్ని అమెరికా పంపే ఏర్పాట్లు సేసేశాను. ఆడి పేరు గూడా, పంతులు మేష్టరి చేత గొప్పోళ్ళ పేరు 'సిద్దార్ధ' అని పెట్టించేను. అంచేత నా తర్వాత ఏదయినా నీకే... నువ్విన్నవన్నీ గాలి కబుర్లు. పెమానం సేస్తున్నా నీకే సెర్మేను పదవిఖాయం'' అంటూ విస్కీ గ్లాసులో కొంచెం పోసుకున్నాడు.



''అన్నయ్యా!'' కాళ్ళమీద పడి పోయాడు సూరయ్య. భగవంతుడు భక్తుడ్ని అక్కున చేర్చుకుని వరమిస్తున్నట్లు తండ్రి సూరయ్యకు విస్కీగ్లాసందించాడు.

సిద్దార్ధ మీదకు వచ్చేశాడు. తండ్రి మంత్రి అయినట్లు సన్మానాలు జరుగుతున్నట్లు యివన్నీ అతని వూహా లోకంలో విహరిస్తూంటే ఏమీ తోచక బాల్కనీలో పచార్లు వేయటం మొదలు పెట్టాడు.

తెల్లవారింది. ఊరు వూరంతా చైర్మన్ అప్పలనాయుడిగారింటి ముందు వుంది. చైర్మనుగారి తమ్ముడు సూరయ్య చనిపోయాడు. ''బాల్కనీ నుండి తూలిపడి మరణించాడు. నాకుడిభుజం పోయింది...'' నెత్తి నోరూ కొట్టుకుని ఏడుస్తున్నాడు అప్పలనాయుడు అతని నెదురు చీట్లే రక్తం కారుతోంది.

''ఆహా సోదర ప్రేమంటే యిలా వుండాలి''అనుకున్నారు జనమంతా. కుటుంబ కలహాల వల్ల పదేళ్ళుగా విడిచి పెట్టబడిన సూరయ్య భార్య గూడా వచ్చి గగ్గోలు పెట్టింది. మర్నాడు హాలులో తమ్ముడు ఫోటో పెట్టి దండలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు కాబోయే మంత్రిగారు.


గత నెలరోజులుగా విచలితమైన మనస్సుతో వున్నాడు సిద్దార్థ. తండ్రి బయటికి వెళ్ళడం తగ్గించాడు. డాక్టర్లు కొంతకాలం రెస్టు తీసుకోమన్నారు. రోజూ ఎవరో వస్తున్నారు. పోతున్నారు.

ఆ రోజు సిద్దార్ధకు హఠాత్తుగా తెలివివచ్చింది. టైము రాత్రి పన్నెండు దాటింది. అతని గొంతుక తడారిపోయింది. జగ్గులో నీళ్ళు లేవు. వీరయ్యకసలు పని తెమలటం లేదు. వాడు నీరు పెట్టడం మరచిపోయాడు. తండ్రికి గూడా అతనే సేవ చేయాల్సి వచ్చింది. క్రిందకు దిగి ఫ్రిజ్‌లో చల్లనినీరు త్రాగి గదిలోకి వెళ్ళబోతున్న సిద్దార్ధకు తండ్రిగదిలో గాజుల గలగలలూ, నవ్వులూ, కేరింతలూ వినిపించాయి. తలుపులు గడియవేసి వున్నాయి. తలుపు తాళం కన్నంలో నుండి చూశాడు.

అంతే! అచేతనుడయ్యాడు. మళ్ళా గొంతుక ఎండిపోయింది ఆ దృశ్యం చూసి తండ్రి నగ్నంగా వున్నాడు. అతని చుట్టూ నలుగురు అమ్మాయిలు నగ్నంగా వుండి నవ్వుతూ, కేరుతూ, గ్లాసులో విస్కీ ఒంపుకుని తాగుతూ అతన్ని కవ్విస్తూ కౌగలించుకుంటున్నారు. విచ్చల విడి విహారం...తుచ్ఛదశకు దిగజారిన కామం అని అతనికి తెలియదు. అతని గుండె వడదడలాడింది. తనివి తీరా చూడాలనే తపన మీద భయం కౌగలించుకుంది. నీరసంగా గదిలోకి వెళ్ళిపోయాడు.

రేపు అమెరికా ప్రయాణమనగా ముందురోజు పెద్ద ఫంక్షను ఏర్పాటుచేశారు చైర్మనుగారు. చాలా మంది వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పండితులు పంచరత్నాలు చదివారు.

ఆ రోజురానే వచ్చింది. కానీ సిద్దార్ధ ప్రయాణం ఆగిపోయింది. అకస్మాత్తుగా అప్పలనాయుడు మేడ మెట్లమీద నుండి జారి మరణించారు. అంతిమ యాత్రకు పట్నం, పట్నం అంతా కాకుండా జిల్లాలో




చాలామంది ప్రముఖులు వచ్చారు. ''ఒక గొప్ప ప్రజా సేవకుడ్ని కోల్పోయాం'' అని ప్రముఖులు, పేపర్లు, రేడియోలు ఘోషపెట్టాయి! దహన సంస్కారాలు చేసి ఒంటరిగా సిద్దార్ధ గదిలో కూర్చున్నాడు.

''అల్లుడుగారూ నాన్నగారు చనిపోయారని దిగులు పడకు. నేనూ నావర్గం నీవెనక వుంటాం...నీకేం భయం లేదు. యువకుడివి. నీ తండ్రి స్థానాన్ని నీవు ఆక్రమించాలి...'' అంటూ వేర్వేరుగా ఆడపిల్లల తండ్రులు, ప్రెసిడెంట్లూ ఒకరికి తెలియకుండా మరొకరు సిద్దార్ధకు ధైర్యం చెప్పారు.

దిన కార్యాలయిన మూడోరోజు ఉదయం తండ్రి తైలవర్ణ చిత్రానికి పూలమాల వేస్తూ నమస్కరించాడు. ఆ కార్యక్రమానికి చాలా మంది హాజరయినారు. అప్రయత్నంగానే ప్రక్కనున్న ఫోటో సూరయ్య బాబాయ్‌ది చూశాడు. ఆ కళ్ళు దీనంగా వున్నాయి.... ఆ రోజూ అవేకళ్ళు దీనంగా కన్నీళ్ళు వర్షిస్తున్నాయి. ''నాది తప్పయిందన్నయ్యా!...'' బాల్కనీ చివర నిలబడి గొంతు పిసకబడుతున్న సూరయ్య మాటలు.... 'నీ నియోజకవర్గంలో వుండే జనాన్ని పరామర్శించడం కోసం నీకు ఎమ్మెల్యే వుండాలి. నీ జిల్లా ప్రజల దండాలందుకోవడం కోసం నీకు చేర్మెనుపదవుండాలి. డబ్బూ, దస్కం మంచీ చెడ్డా చూసుకోవడానికి బేంకు ప్రెసిడెంటు పదవి వుండాలి. కుర్రోళ్ళు నీకంట్రోలులో వుండటం కోసం కాలేజీ ప్రెసిడెంటు పదవి వుండాలి. యింకా యివి చాలవు. రాష్ట్రంలో ప్రజల బాగోగులు చూసుకుందికి మంత్రి పదవి వుండాలి. తర్వాత దేశ ప్రజలందర్నీ తనివితీరా చూసుకోవడానికి పెద్ద మంత్రి పదవో ప్రధానమంత్రి పదవో గూడా వుండాలి. ఇవన్నీ నేను చక్రం తిప్పి తెప్పిస్తాను. బుద్ది పొరపాటయి పదవి అడిగేను. నన్ను చంపకు. నీ కిష్టం లేకపోతే చాలా దూరం పోయి కూలి చేసుకుని బతుకుతాను...'' అని దీనంగా ఆక్రందన అర్ధరాత్రి వినిపిస్తున్నాది. ''ఒరేయ్! నీకసలు అలాంటి బుద్ధి పుట్టగూడదు. పదవి వేపకొమ్మలాంటిదిరా. అది తీస్తే అసిరమ్మయి కూర్చుంటుంది. నీకు పదవిస్తే నాకు పతనం ఖాయం. ప్రెసిడెంటుకిచ్చినా, ఆడికూతుర్ని నాకొడుక్కి చేసుకుంటాను. ఆడు ఎదవ్వేసాలు వేస్తే ఆడికూతురి జీవితం బుగ్గయి పోద్ది. నీకు సావే గతి'' అంతే దీనమైన ఆక్రందన, రేక విశ్రాంతరాళంలో కరిగిపోయింది. సిద్దార్ధ కళ్ళు చెమర్చాయి.

''అప్పలనాయుడుగారూ అమర్ రహే'' వెనుక వాళ్ళ నినాదం వినిపించింది. ''బాబూ! దీపం వెలిగించు...'' అన్నాడు వీరయ్య గాద్గదికంగా. ఫోటో వేపు చూశాడు సిద్దార్ధ.

''నాన్నా ఆరోజ నీవు అమెరికా ఫంక్షను తర్వాత బాగా త్రాగి నా దగ్గరకు వచ్చావు. నేను నిద్రపోతున్నట్లు నటించాను. నన్ను లేపటం ఇష్టం లేక నెను తిరిగి మెట్లు దిగుతున్నావు. అరవైయేళ్ళు దాటినా నీవు అందం, ఐశ్వర్యం, పదవి, వైభవం యివన్నీ ఇంద్రుడిలా అనుభవిస్తున్నావు. నాకు యింకా ఇరవైరెండో సంవత్సరం. నేనూ జీవితం అనుభవించాలి. నాకు పదవి, అందం, ఐశ్వర్యం, సౌందర్యం యివన్నీ ఈ వయస్సులోనే అనుభవించటానికి కావాలి....

నాన్నా! మనిషి పదవిని వేటాడుతాడు. పదవి మనిషిని వేటాడుతుంది. నన్ను విదేశాలు పంపించడానికి ఏర్పాట్లు చేశావు. నా జీవితం నాకు అమూల్యమైనది. అనుభవైక్యవేద్యమయినది. నా అభిరుచికి తగ్గట్టు మలచుకోవాలి. నువ్వున్నంత కాలం జరుగదు. నీకు వారసుడుగా నిలబడి ఈ వయస్సులోనే పదవిని చేపట్టి అన్నీ అనుభవించాలి. అందుకనే మెట్లమీద పరచిన కార్పెట్టు క్రిందకు లాగేశాను. నీ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను...'' మనస్సులో అనుకుంటూ దీపం వెలిగించి సాగిలపడి మొక్కాడు.

ఆ తరువాత ఎందరో ప్రముఖులు సిద్దార్ధమెడలో పూలదండలు వేశారు. కాబోయే రాజకీయనాయకుడుగా, జిల్లా అధినేతగా నియోజకవర్గం ఎమ్మెల్యేగా అభినందనలు కురిపిస్తూ నిలువెత్తు పూలదండలు పడ్డాయి.

ఆ తరువాత ముత్తయిదువలు ఎదురు రాగా, ముందరి కార్లు దారిచూపగా తెల్ల ఫియట్ కారు కదిలింది విశాఖపట్నం వేపు. హైదరాబాదు వెళ్ళే గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు అందుకోడానికి.

ఆ తెల్లకారులో ఒక్క సిద్దార్థుడే కాదు, అతన్ని పంజరంలో బంధించిన కామక్రోధ లోభ మద మత్సర్యాలు, ఇంద్రియలాలసత కీర్తికాంక్ష, ఆత్మ స్తోత్రాశక్తీ... యివన్నీ...యివన్నీ ప్రయాణం చేస్తున్నాయి.